# సత్య వాక్య

# THE WORD OF TRUTH

# కీర్తన పుస్తకములు

మీ కుటుంబ, సంఘూరాధనలలో చక్కగా పాటలు పాడి దేవుని స్తుతించుటకు వీలుగా యుండుటకు ఒక చక్కని కీర్తనల పుస్తకము తయారు చేయబడినది. దానిలో 231 పాత క్రొత్త కీర్తనలు పొందుపరుపబడి చక్కగా బైండింగ్ చేయబడినది.

ఫుల్ క్లాత్ బైండింగ్ పుస్తకము ఖరీదు రూ. 5-50

సగంక్లాత్ బైండింగ్ పుస్తకము ఖరీదు రూ. 4-00

పోస్టేజి అదనం. కీర్తనల పుస్తకములను V. P. P. ద్వారా కూడా పొందవచ్చును. వలయువారు ఈ దిగువ చిరునామాకు ఈనాడే వ్రాయండి.

**SATYAVANI**

Seshagiri Rao Street,

Ramaraopet, KAKINADA - 533 004.

# సత్యవాక్కు

క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box 80, KAKINADA-533 001.**

*Editor* J. C. CHOATE

*Managing Editor* JOSHUA GOOTAM

**Pleading for restoration of pure New Testament Christianity.**

సంచిక **7** ఫిబ్రవరి **1983** సంపుటి **3**

## సంపాదకీయము

### బోధకుని పాత్ర

### *(The Role of the Preacher)*

క్రీస్తు సువార్త బోధించుట క్రొత్త నిబంధనలో సూచింపబడిన పనులలో ఒకటి. ఈ పనిని చేయువాడు సువార్తికుడు లేక బోధకుడు. అపొస్తలులు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించవలెనని క్రీస్తు ఆజ్ఞాపించెను (మార్కు 16:15). యౌవన బోధకుడగు తిమోతిని అపొ. పౌలు ఇట్లు హెచ్చరించెను: "వాక్యమును ప్రకటించుము; సమయమందును అసమయమందును ప్రయాసపడుము; సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుచు ఖండించుము, గద్దించుము, బుద్ధి చెప్పుము" (2 తిమో 4:2). తన్ను గూర్చి చెబుతు "అయ్యో, నేను సువార్తను ప్రకటింపక పోయినయెడల నాకు శ్రమ" అని పలికెను" (1 కొరింథీ 9:16).

దేవుని ప్రజలందరు దేవుని వాక్యాన్ని బోధించాలి, ఉపదేశించాలి. ఈ విషయంలో అందరు సువార్త వ్యాప్తి చేయువారిగ

యుండాలి. అంటే యితరులు క్రీస్తువైపు మార్చబడునట్లు బోధించుచు జీవించాలి. బహిరంగ కూటములలో నయితే, పురుషులు స్త్రీలు కలిసి యున్నచోట పురుషులే బోధించాలి. అందువలన బోధకుడు కాగోరు వాడు కొన్ని అర్హతలను కలిగి యుండాలని దీనివలన గ్రహింపగు చున్నది. మొదటిగా అతడు క్రైస్తవుడు, క్రీస్తు సంఘ సభ్యుడు అయ్యుండాలి. రెండవదిగా, అతడు యధార్ధ వర్తనుడై, నిష్కపట ముతో తాను బోధించుదాన్ని జీవించాలి. మూడవదిగా అతడు దేవుని యందు, క్రీస్తునందు ఆయన వాక్యమునందు విశ్వాసము కలిగి, రక్షణ వర్తమానమును యితరులకు బోధించుట కాసక్తిగలవాడై యుండాలి. నాల్గవదిగా, అతడు ప్రభువును మనుష్యుల ఆత్మలను ప్రేమించాలి. ఆరవదిగా అతడు దేవుని వాక్యాన్ని సరిగ నుపదేశించాలి. లేనియెడల తాను తన ఆత్మనే గాక యితరుల ఆత్మలను కూడా నాశనమునకు నడిపించువాడగునని గుర్తించుకొని యుండాలి.

బోధకుడైనవాడు కేవలం జీవనోపాధికొరకే బోధించరాదు. బోధకుని పనిని ఒక ఉద్యోగంగా ఎంచరాదు. అతడొక రెవరెండు గాని, పాస్టర్ గాని, బిషప్ గాని కాదు. అతడు బిరుదుల నేమీ ధరించ కోరాదు.

యౌవనులను సువార్త బోధించునట్లు ప్రోత్సహించాలి. స్థానిక సంఘాల్లో మనం వారికి బోధించాలి, శిక్షణ నివ్వాలి. బోధించుటకు వారికి తరుణముల నివ్వాలి. బోధించు పనియొక్క ప్రాముఖ్యతను వారికి తెలియజేయాలి. వారిలో సరియైన ఉద్దేశములు నెలకొల్పబడు నట్లు ప్రయత్నించాలి. బోధకునిగా తయారవ్వాలంటే సెమినెరీలకు, కాలేజీలకు వెళ్ళనక్కరలేదు. డినామినేషను వారు నడిపించే ఈ రక మైన సంస్థలలో బైబిలునుగూర్చి వారు బోధింతురుగాని బైబిలును మాత్రము బోధించరు. అలాగ తర్బీదు అయినవారిని ఆయా సంఘాల్లో నాయకత్వం వహించడానికే వారు పంపుదురుగాని, బైబిలును బోధించి

మనుష్యులను మార్చుటకు కాదు. వారి సంస్థలలో యున్న ఉపదేశకులు ప్రభువునందును ఆయన వాక్యమునందును విశ్వాసము లేనివారు గనుక వారి విద్యార్థులుకూడా తమ విశ్వాసాన్ని కోల్పోవుదురు. యిది విచారకరం. క్రీస్తు సంఘంలో మన బోధకులు అట్టి సంస్థలకు వెళ్ళనవుసరం లేదు. బోధించాలంటే విదేశాలకు పరుగెట్టనవుసరం లేదు. బోధకునిగా సిద్ధపడు వాడు తన బైబిలును చదువుచు ధ్యానించుచు ఆత్మీయంగా ఎదుగవలెను.

డినామినేషనల్ బోధకులు తమ సంఘమునుండి ఆర్డినేషన్ (అభిషేకము) పొందుతారు. అంటే వారిప్పుడు బోధకులైనట్లు ప్రకటించడానికి ఏదో ఒక ప్రత్యేక "ఆరాధనను" జరుపుతారు. క్రీస్తు సంఘంలో మాకు అట్టి ఆచారమేమీ లేదు. మనందరం సువార్త బోధించాలని క్రీస్తు ఆజ్ఞాపించాడు. మనం క్రైస్తవులమైతే, బోధించే శక్తిని కలిగియుంటే, బైబిలును చదువుచూ మనం సిద్ధపడితే, ఆయన వాక్యాన్ని ప్రకటించుటకు మనం సంసిద్ధులమే.

మానవులందరికీ సువార్త అవుసరం గనుక క్రీస్తు శుభవార్తను వారికి అందించే బాధ్యత మనమీద వుంది. పట్టణాలలోను పల్లెలలోను, దగ్గరలోను దూరములోను ఉన్నవారికి, విద్యావేత్తలకు పామరులకు, ధనికులకు ధనహీనులకు అందరికీ సువార్త అవుసరం.

జీవనోపాధికోసం ఏదో ఉద్యోగం చేసుకుంటూ ఒకడు ఆదివారల్లోను మిగతా సమయములలోను సువార్త బోధింపవచ్చును. లేదా సువార్తికుని సంపూర్తిగ పోషించు స్థానిక సంఘమేమైనా యున్న యెడల, అతడు ఆ సంఘముతో సంపూర్ణ సమయాన్నిచ్చి పనిచేయవచ్చును. లేదా రెండు మూడు స్థానిక సంఘాలు కలసి ఒక బోధకునికి జీతాన్నియ్యవచ్చును. అప్పుడతడా సమయాన్ని ఆ స్థానిక సంఘాల పనిలో పూర్తిగ వినియోగించును.

ఒక స్థానిక సంఘములో పనిచేయునప్పుడు బోధకుని పాత్రయేమై యుండును? ఇంతకు ముందు చెప్పుకొన్న రీతిగా అతడొక రెవరెండు గాని బిషప్పు గాని పాస్టరు గాని కాడు. అతడొక యజమాని కాడు. అందువలన అందరు అతనికి లోబడాలని బలవంతపెట్టరాదు. అతడు సభ్యులను స్వలాభంకొరకు వినియోగించుకోరాదు, వారిని అస్తమానం విమర్శించకూడదు; అతని మాట వినకపోతే వారిని సంఘమునుండి నెట్టివేయరాదు. సరిగదా దేవుని వాక్యమునుండి సంఘాన్నంతటికి క్షేమాభివృద్ధి కలుగజేసే మంచి ప్రసంగములనందించుచు అవిధేయులుగ యున్న వారు దేవునికి విధేయులగునట్లును, సంఘాన్ని ప్రోత్సాహించుటకును అతడు పిలువబడ్డాడు. అతడు సంఘాన్ని చంపివేయుటకు కాదు గాని దాన్ని పెంపారు చేయుటకు అక్కడ ఉన్నాడు. ఆత్మలను రక్షించుటకు అతడు గ్రామాల్లోను తన ఏరియాలోను సువార్త కూటములను జరిపించాలి. సంఘములో యున్నవారికి, వెలుపలి వారికి అతడు మంచి మాదిరిగ యుండాలి. ఈరీతిగా అతడు మన్నననొందును. అనేకులను మంచి మార్గములో నడిపించును. సంఘములో యున్న పురుషులకు యౌవనులకు వృద్ధులకు ప్రార్థన చేయుట, ప్రభురాత్రి భోజనమునందించుట వాక్యోపదేశము చేయుట అతడు నేర్పించాలి. స్త్రీలు స్త్రీలకు పిల్లలకు బోధించుటను అతడు నేర్పించాలి. సంఘము, అతడు కలసి మంచిపని చేయుటలో నిమగ్నులై యుండాలి. ఈ విధంగా బోధకుడు పనిచేసినయెడల ఆ సంఘము సంఖ్యలోను, ఆత్మీయతలోను అభివృద్ధిజెందును. ఆ గ్రామంలో లేక పట్టణంలో యున్న క్రీస్తు సంఘానికి మంచి పేరు కలుగును. ప్రభువు మహిమ పర్చబడును.

కొంతమంది బోధకులు సువార్తికులుగ యున్నట్లు మనం క్రొత్త నిబంధనలో చూడగలము. వారు అనేక సంఘాల్లో బోధించుచు,

ప్రయాణించుచు మనుష్యులను ప్రభువు తట్టు మార్చి స్థానిక సంఘా లను నెలకొల్పినవారు. సాధారణంగా అట్టివారిని మనం మిషనెరీలని పిలుస్తాము. యౌవన బోధకుడైన తిమోతికి పౌలు ఇట్లు వ్రాసాడు : "నీవు అన్ని విషయములలో మితముగా ఉండుము, శ్రమపడుము, సువార్తికుని పనిచేయుము, నీ పరిచర్యను సంపూర్ణముగా జరిగించుము" (2 తిమో 4:5).

బోధకుడు పెండ్లి చేసుకొనే సంగతి యేమిటి? పౌలు వివాహి తుడైనట్లు మనకు ఎక్కడా రికార్డులేదు గాని పేతురుయొక్క అత్తను గూర్చి చదువగలము. పేతురు ఒక సంఘములో పెద్దయనికూడా యున్నది, అంటే అతడు వివాహితుడని గ్రహించుకోగలము (మత్తయి 8:14; I కొరింథీ 9:5; I పేతురు 5:1). గనుక బోధకుడు పెండ్లిచేసి కొనాలో వద్దో యను సంగతి అతనికే వదిలివేయబడింది. అతడు అవివాహితుడై ప్రభువు పనికి ఎక్కువ సమయాన్ని వెచ్చించగోరు చున్నయెడల అతడు అభినందనీయుడు; లేదా పెండ్లి చేసికొని ఒక కుటుంబాన్ని కలిగియుండుట వలన తన చుట్టునున్నవారి మధ్య మంచి పేరు, ప్రభావము కలవాడగుటకు నిశ్చయించుకొంటే అందుకుకూడా అతడు అభినందనీయుడే.

బోధించుట ఏమీ సులువైనది కాదు. దానికి ప్రతిష్ఠత, కష్టించి పనిచేయుట అవుసరం. దానిలో చాల ఓపిక అవుసరం. అనేకసార్లు చాల త్యాగం కూడా చేయాలి. ఒక్కోసారి హింసలుకూడా కలుగు తాయి. అది జీతగాళ్ళది కాదు, మనుష్యుల మెప్పును కోరేవారిది అంతకుముందే కాదు. ఇట్టి పనిలో యున్నవారికి కృతజ్ఞత తెలిపేవారు కూడా అరుదు. అయినను, ఈ లోకంలో యున్న పనులలో అది శ్రేష్టమైనది. క్రీస్తు సువార్తను బోధించుట, క్రీస్తుకొరకు ఆత్మలను సంపాదించుట, ప్రజలకు ఆత్మీయంగాను భౌతికంగాను సహాయపడుట కంటే మిన్నయైన సంతృప్తి వేరొకటి లేదు. చివరిగా, తమ జీవితకాల

మంతయు సమ్మకముగా దేవుని వాక్యాన్ని బోధించినవారికి లభించే నిత్య బహుమానం ఉన్నది.

నీవు సువార్త బోధకుడవా? నీవు ఎందుకు బోధించుచున్నావు? నీవు ఏమి సాధించుచున్నావు? నిన్ను నీ పనిని ఒకసారి చూచుకో. బోధకునిగూర్చి అతని పనినిగూర్చి బైబిలు చెప్పుచున్నట్లు అది లేని యెడల అవుసరమైన మార్పులను చేసికో. అప్పుడు మాత్రమే దేవుడు నిన్ను అంగీకరిస్తాడు. అప్పుడు మాత్రమే బోధించుటలో నీవు జయం పొందుతావు. నీవు యౌవనుడవై బోధకుడవు కాకుండినయెడల నీవు వాక్యాన్ని బోధించాలని నిన్ను ప్రోత్సహించ గోరుచున్నాను. క్రైస్తవునిగాను, క్రీస్తు సంఘ సభ్యునిగాను నీ యాత్మను ఇతరుల ఆత్మలను రక్షించు నిమిత్తము బోధకుడవు కమ్ము గాని వేరే కారణాలకు కాదు. పౌలువంటి బోధకు లనేకులను దేవుడు మనకు ప్రసాదించునుగాక. అట్టివారితో ఆత్మలు రక్షింపబడును. ఈలోకం మంచికి మార్చబడును. దానికంటే శ్రేష్టమైన ఇంకో పనిని మనం దేనిని చేయగలము?

---

## ప్రార్థన *(Prayer)*

(గత సంచిక తరువాయి)

— N. రహంతుల్లా, చీమకుర్తి.

ఎలా ప్రార్థించాలి? ప్రార్థనలో ఇలాంటి విషయాలుండాలి:

1. దేవుని స్తుతించాలి:- పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధ పరచబడును గాక! (మత్త 6:9).
2. పాపాలు ఒప్పుకోవాలి:- "దేవా, నీకు విరుద్ధంగానే నేను పాపం చేశాను" (కీర్తన 51:3, 4).
3. కృతజ్ఞతలు చెప్పాలి:- "నీవు నాకు రక్షణాధారుడవై నాకు ఉత్తర

మిచ్చియున్నావు. నేను నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెదను (కీర్తన 118:21, కొలస్సీ 3:17, I థెస్స 5:18).

4. విజ్ఞాపన చెయ్యాలి :- "మనుష్యు లందరికోసం" "ఒకరికోసం మరొకరు" "దుష్టులనుంచి రక్షణకోసం" (2 థెస్స 3:1,2; 1 తిమోతి 2:1,2, యాకోబు 5:16).

5. వేడుకోవాలి :- "అన్ని అవసరాలకోసం" పాప క్షమాపణ కోసం (మత్త 6:11-13, యాకోబు 1:5).

ప్రార్థనను గురించి కొన్ని తప్పుడు భావాలు ప్రజల్లో చోటు చేసుకొన్నాయి. వాటికి సమాధానాలు యివే.

1. ప్రార్థనకు సమాధానంగా "అద్భుతం" జరగాలా?

అవసరం లేదు. నెహెమ్యా దేవునికి ప్రార్థించి రాజును కోరగా రాజు అతని కోరికలన్నింటినీ అంగీకరించాడు. "నాకు తోడుగా వుండి నాకు కృప చూపుచున్న నా దేవుని కరుణా హస్తము కొలది రాజు నా మనవి ఆలకించెను" (నెహెమ్యా 2:1-9).

2. అద్భుతాలకు అంతం లేదా? అవి ఆగిపోలేదా?

"ప్రేమ శాశ్వతకాల ముంటుంది. ప్రవచనాలైనా నిరర్థకమౌతాయి. భాషలైనా నిలిచిపోతాయి. జ్ఞానమైనా నిరర్థకమౌతుంది" (1 కొరింథీ 13:8).

3. దేవుడు తన సేవకుల కోర్కెలన్నిటినీ ఎల్లప్పుడూ తీరుస్తాడా?

"ఆ ముల్లును నానుంచి తొలగించమని ప్రభువును ముమ్మారు …తిమాలుకొన్నాను. కాని ఆయన నా కృప నీకు చాలు అన్నాడు" (2 కొరింథీ 2:8, 9).

4. మన ప్రార్థనలు వినబడినవో లేదో మనం తెలుసుకోవచ్చా?

"ఆయన చిత్తప్రకారం మనం ఏది అడిగినా ఆయన మన … వింటాడనే నమ్మకం మనకు వుంది" (1 యోహాను 5:14).

5. ఒకే ప్రార్థన పదేపదే చెయ్యటం వ్యర్థమా?

"ఆయన వారిని విడిచి మళ్ళీ వెళ్ళి మూడోసారి ఆ మాటలే అంటూ ప్రార్థించాడు" (మత్తయి 26:44).

6. ప్రార్థన కోసం సమయం పెట్టుకోవటం ప్రమాదమా?

"ఇట్టి శాసనము సంతకము చేయబడెనని దానియేలు తెలిసికొనినను అతడు తన యింటికి వెళ్ళి, యథాప్రకారముగా అనుదినము ముమ్మారు మోకాళ్ళూని, తన యింటి పై గదిలో తన దేవునికి ప్రార్థన చేయుచు ఆయనను స్తుతించుచు వచ్చెను" (దానియేలు 6:10).

7. ప్రార్థన కోసం ప్రత్యేక వేళ అంటూ వుందా?

"అన్ని సందర్భాల్లో" (ఫిలిప్పీ 4:6). "ఎడతెరిపి లేకుండా" (అ.కా. 2:42). "అర్ధరాత్రిలో సైతం" (అ.కా. 16:25).

8. ఎంత ఎక్కువ మాట్లాడితే అంత మంచి ప్రార్థనా?

"నీవు ప్రార్థించేటప్పుడు వృథా మాటలు పదేపదే పలుకకు బోలెడన్ని మాటలు మాట్లాడితేనే దేవుడు వింటాడనుకొనే వాళ్ళలాగా వుండకు" (మత్తయి 6:7).

9. నిలబడి ప్రార్థించటం పాపమా?

"సుంకరి నిలబడే ప్రార్థించాడు" (లూకా 18:13).

10. మోకరించటం మరీ మొరటు పాత పద్ధతా?

"నేను తండ్రి అయిన దేవుని ఎదుట మోకరించి మీకోసం ప్రార్థిస్తున్నాను" (ఎఫెసీ 3:14).

11. దీర్ఘ ప్రార్థనలు మంచివి కావా?

"యేసు ప్రార్థన చేసుకోవటానికి కొండమీదికి వెళ్ళి రాత్రంతా అక్కడే ప్రార్థనలో వుండిపోయాడు" (లూకా 6:12).

12. క్లుప్త ప్రార్థనలు ఇహలోక మనస్తత్వానికి గుర్తా?

"యేసు కొంచెం దూరంవెళ్ళి సాగిలపడి, నాతండ్రీ సాధ్యమైతే

ఈ గిన్నె నా వద్దనుండి తొలగిపోనివ్వు. అయినా నా యిష్టం కాదు. నీ యిష్టమే అని ప్రార్థించాడు" (మత్త 26:39).

13. ప్రార్థనకు మధ్యవర్తిగా ఒక బోధకుడు కావాలా?

"దేవుడొక్కడే. దేవునికి మనిషికి మధ్యవర్తి యొక్కడే. ఆయన క్రీస్తు యేసు అనే నరుడు" (1 తిమోతి 2:5).

14. ఇహలోక వస్తువులకోసం ప్రార్థించటం వ్యర్థమా?

"మా అనుదినాహారం నేడు మాకు దయచేయుము" (మత్తయి 6 : 11).

15. ప్రార్థనద్వారానే తిరిగి జన్మిస్తారా?

"ఒకడు నీటిమూలంగాను, ఆత్మమూలంగాను తిరిగి జన్మించనట్లయితే వాడు దేవుని రాజ్యంలో ప్రవేశించలేడు" (యోహాను 3:5).

16. ప్రార్థనద్వారా దేవుని పిల్లలం కాగలమా?

"యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు" (గలతీ 3:26).

17. ప్రార్థనద్వారా క్రీస్తును ధరించుకోగలమా?

"క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:27).

18. ఎలాంటివాడు ప్రార్థించినా దేవుడు ఆనందిస్తాడా?

"ధర్మశాస్త్రము వినబడకుండా చెవిని తొలగించుకొను వాని ప్రార్థన హేయము" (సామెతలు 28:9).

19. మన పాదాలకు దీపం, మన త్రోవకు వెలుగు ప్రార్థనా?

"నీ వాక్యము నా పాదములకు దీపము, నా త్రోవకు వెలుగు" (కీర్తన 119:105).

20. సందేహించేవాడు విశ్వాసంకోసం ప్రార్థించాలా?

"అతడు ఏమాత్రమును సందేహింపక విశ్వాసముతో అడుగవలెను" (యాకోబు 1:6).

# ప్రార్థనకు వచ్చే సమాధానాలు

1. సమాధానం అసంభవం

"దేవుని అడుగనందున మీ కేమియు దొరుకదు. మీరు గినా మీ భోగాలకోసం దురుద్దేశంతో అడుగుతారు గనుక కేమియు దొరుకదు" (యాకోబు 4:2, 3).

2. గద్దించే సమాధానం

"అక్రమస్థులారా, నేను మిమ్మెన్నడూ ఎరుగను. నా నుండి పొండి" (మత్తయి 7:21-23).

3. వ్యతిరేక సమాధానం

"అయినా నా యిష్టం కాదు నీ యిష్టమే" (మత్త 26:39)

4. సరిదిద్దే సమాధానం

"ఆమె పాళెము వెలుపట ఏడు రోజులు వుండాలి" (సంఖ్య 12:1-15).

5. ఆలస్యంగా అందే సమాధానం

"దేవుని ఆజ్ఞ జరిపేవరకు అది అందదు" "ఏడు రోజులు శాలల పండుగ జరుపాలి" "పశ్చాత్తాపపడి యేసుక్రీస్తు బాప్తిస్మం పొందాలి" (లేవి 23:34, అ.కా. 2:38).

6. ఆధారపడిన సమాధానం

"నీవే నన్ను పంపించావని లోకం నమ్మగలిగేటట్లు నేను నీ నీవు నాలో వున్న ప్రకారం వారుకూడా మనలో ఒకటిగా వుం చెయ్యి" (యోహాను 17:21).

7. సహకార సమాధానం

"అతను చెప్పే సందేశంద్వారా నీకు నీ యింటివారంద విముక్తి కలుగుతుంది" (అ.కా. 11:14). "యేసుక్రీస్తు పేరిట బా పొందాలి" (అ.కా. 10:48).

8. నిశ్చయ సమాధానం

"ఆయన ఆజ్ఞలకు లోబడుతూ ఆయన కిష్టమైన వాటినే చేస్తున్నాం గనుక మనం ఏది అడిగినా ఇస్తాడు" (1 యోహాను 3 : 22, యోహాను 5:14).

(సమాప్తం)

## సృష్టి - పరిణామము
## *(Creation – Evolution)*

ప్రపంచమందు జీవరాసుల ప్రారంభమును గూర్చి మానవులు వివిధములైన అభిప్రాయములు కలిగియున్నారు. వాటిలో రెండు ముఖ్యమైన సిద్ధాంతములు లేక క్రమములు ప్రచారములో ఉన్నవి. వాటిలో మొదటిది, సర్వ శక్తిమంతుడైన దేవుడు ఈ సృష్టి నంతటిని సృజించెననెడి విషయము. రెండవది, భూమిమీద కొన్ని మార్పులు జరిగి జీవపదార్థము తనంతట తానే ఉద్భవించి ఏకకణజీవులుగ ఏర్పడి అవి పరిణామము చెంది, చివరకు కోతిగా మారి, కోతినుండి మానవుడు పరిణామము చెందెనను సిద్ధాంతము.

1859వ సంవత్సరము నవంబరు 24వ తేదీన చార్లెస్ డార్విన్ అను నతడు "జీవరాశుల ప్రారంభము" అను పుస్తకమును మొట్ట మొదట విడుదలచేసెను. యిందు వ్రాయబడిన పరిణామ సిద్ధాంతము ప్రపంచమును కలవరపెట్టుచున్నది. ఈ సిద్ధాంతముయొక్క బలహీనత లను మీకు తెలియజేయుట మాకర్తవ్యమై యున్నది.

సిద్ధాంతమనగా ఒకని ఉద్దేశ్యము లేక ఆలోచన. ఒక సిద్ధాంత మును అది యదార్థమని నిరూపించినపుడే అది విజ్ఞాన శాస్త్రముతో కలుపుటకు వీలున్నది. పరిణామ సిద్ధాంతము యిప్పటివరకు యథార్థ మని నిరూపింపబడలేదు. వాస్తవమని నిరూపింపబడని పరిణామ సిద్ధాంతమును మనము తిరస్కరింపవలసి యున్నది.

ఒకప్పుడు పరిణామము జరిగినయెడల యిప్పుడు ఎందుకు జరుగుట లేదు? యిప్పుడు పరిణామము జరుగుట మనము చూడలేము. అయితే ఒకప్పుడు జరిగెనని ఎట్లు నమ్మగలము? నిర్జీవ పదార్థమునుండి జీవపదార్థ ముద్భవించెనని డార్విన్ చెప్పెను. నిర్జీవ పదార్థమునుండి ఎక్కడైనను ఎప్పుడైనను జీవపదార్థము వచ్చెనా? ఈ విషయము ఎంత హాస్యాస్పదము?

భూమిపై ప్రతి వస్తువునకు దానిని తయారుచేసినవాడు లేక కర్తయైనవాడు ఒకడున్న విషయము అందరికీ తెలిసినదే. భూమి అందలి సృష్టి, విశ్వము, గాలి, నీరు, యివన్నియు ఎట్లు వచ్చెను? ఒక చిత్రము వెనుక ఒక చిత్రకారుడు ఖచ్చితముగా ఉన్నాడు. చిత్రకారుడు లేకుండ చిత్రము లేదు. సృష్టి వెనుక ఒక మహత్తర శక్తి ఉన్నది. ఆయనే దేవుడు.

పరిణామ సిద్ధాంత ప్రకారము ఎల్లప్పుడు మార్పు ఆలస్యముగా జరుగవలెను. ఉదాహరణకు కన్ను, లేక మెదడు వేలకొలది మార్పులతో ఒకేసారి ఒక జంతువునందు మొట్టమొదట కలిగెను. కంటి నిర్మాణమంతయు ఎంతో అద్భుతరీతిలో చక్కగా జరిగినది. యింత గొప్ప నిర్మాణము, వేలకొలది మార్పులు ప్రమాదవశాత్తు ఎట్లు జరిగెను? ఒక నాణెమును టాస్ వేసినపుడు వరుసగా వెయ్యిసార్లు బొమ్మ పడుట ఎంత దుర్లభమో, మానవుని అవయవ నిర్మాణమంతయు లేక ఒక జంతువుయొక్క అవయవ నిర్మాణమంతయు దానికదే జరిగెననుట హాస్యాస్పదము.

ఏ శాస్త్రజ్ఞుడు కన్నును మించిన టెలిస్కోపును తయారుచేయ లేదు. కన్ను ప్రత్యేకమైన రీతిలో నిర్మించబడినది. కన్ను దానికదే ఎట్లు నిర్మింపబడెను?

ఈ 20వ శతాబ్దమునందు వేరువేరు పరిణామ సిద్ధాంతములు దీనిపై వ్రాయబడెను. అవి ఒకదాని కొకటి విరుద్ధముగా నున్నవి.

బట్టి పరిణామ సిద్ధాంతము నూటికి నూరుపాళ్ళు అబద్ధమని తెలియు చున్నది.

పురాతన గ్రంథమైన బైబిలు చక్కని సృష్టిక్రమమును గూర్చి బోధించుచున్నది. విజ్ఞానశాస్త్రము బైబిలు యదార్థమైనదని బోధించు చున్నది. ఎట్లనగా ఈనాడు శాస్త్రవేత్తలు కనుగొన్న విషయములను గూర్చి వేల సంవత్సరముల క్రితము వ్రాయబడిన బైబిలు గ్రంథము చెప్పుచున్నది. బైబిలు పలుకుబడికి కారణము అది దేవుని వాక్యము.

"దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములలో అనుకొందురు" (కీర్త 53:1).

—ఇ. కె. వి. ప్రసాదరావు, చెయ్యేరు.

## ఒక కుష్ఠురోగి నుండి 9 గొప్ప పాఠములు

*(9 Great Lessons from the Story of a Leper)*

సిరియా రాజు సైన్యాధిపతియైన నయమాను అను నొకడుండెను. అతనిచేత యెహోవా యే సిరియా దేశమునకు జయము కలుగజేసెను. గనుక అతడు తన యజమానుని దృష్టికి ఘనుడై దయ పొందినవాడాయెను. అతడు మహా పరాక్రమశాలియై యుండెను గాని అతడు కుష్ఠురోగి. సిరియనులు గుంపులుగుంపులుగా బయలుదేరి ఇశ్రాయేలు దేశముమీదికి పోయి యుండిరి. వారచ్చటనుండి యొక చిన్నదాని చెరగొని తేగా, అది నయమాను భార్యకు పరిచారము చేయుచుండెను. అది - షోమ్రోనులోనున్న ప్రవక్తదగ్గర నా యేలిన వాడుండవలెనని నేనెంతో కోరుచున్నాను. అతడు నా యేలినవానికి కలిగిన కుష్ఠరోగమును బాగుచేయునని తన యజమానురాలితో అనెను. నయమాను రాజునొద్దకు పోయి ఇశ్రాయేలుదేశపు చిన్నది చెప్పిన మాటలను అతనికి తెలియజేయగా సిరియా రాజు - నేను ఇశ్రాయేలు రాజునకు దూతచేత పత్రిక పంపించెదనని ఆజ్ఞ ఇచ్చెను.

గనుక అతడు ఇరువది మణుగుల వెండియు, లక్ష యిరువదివేల రూపాయల బంగారమును, పది దుస్తుల బట్టలును తీసికొనిపోయి ఇశ్రాయేలు రాజునకు పత్రికను అప్పగించెను. ఆ పత్రికలోవున్న సంగతి యేదనగా నా సేవకుడైన నయమానునకు కలిగిన కుష్ఠురోగమును నీవు బాగుచేయవలెనని యీ పత్రికను అతనిచేత నీకు పంపించియున్నాను. ఇశ్రాయేలు రాజు ఈ పత్రికను చదివి వస్త్రములు చింపుకొని - చంపుటకును బ్రతికించుటకును నేను దేవుడనా ? ఒకనికి కలిగిన కుష్ఠురోగమును మాన్పుమని నాయొద్దకు యితడు పంపుటయేమి ? నాతో కలహమునకు కారణము అతడు ఎట్లు వెదకుచున్నాడో మీరు ఆలోచించుడనెను. ఇశ్రాయేలు రాజు తన వస్త్రమును చింపుకొనిన సంగతి దైవజనుడైన ఎలీషాకు వినబడినప్పుడు అతడు _ నీ వస్త్రములు నీ వెందుకు చింపుకొంటివి ? ఇశ్రాయేలులో ప్రవక్త యొకడున్నాడని అతనికి తెలియబడునట్లు అతనిని నాయొద్దకు రానిమ్ము అని రాజునకు వర్తమానము చేసెను. నయమాను గుఱ్ఱములతోను, రథములతోను వచ్చి ఎలీషా యింటి ద్వారము ముందర నిలిచియుండగా ఎలీషా - నీవు యొర్దాను నదికి పోయి యేడు మారులు స్నానము చేయుము, నీ ఒళ్ళు మరలా బాగై నీవు శుద్ధుడవగుదువని అతనితో చెప్పుటకు ఒక దూతను పంపెను. అందుకు నయమాను కోపము తెచ్చుకొని తిరిగి పోయి యిట్లనెను-అతడు నాయొద్దకు వచ్చి నిలిచి, తన దేవుడైన యెహోవా నామమునుబట్టి తన చెయ్యి రోగముగావున్న స్థలమువిూద ఆడించి కుష్ఠురోగమును మాన్పునని నే ననుకొంటిని. దమస్కు నదులైన అబనాయును, ఫర్పరును ఇశ్రాయేలు దేశములోని నదులన్నిటికంటె శ్రేష్ఠమైనవి కావా? వాటిలో స్నానంచేసి శుద్ధినొందలేనా? అనుకొని రౌద్రుడై తిరిగి వెళ్ళిపోయెను. అయితే అతని దాసులలో ఒకడు వచ్చి స్వామీ, ఆ ప్రవక్త యేదైన ఒక గొప్ప కార్యము చేయుమని నియమించినయెడల నీవు చేయకుందువా? అయితే స్నానముచేసి శుద్ధుడవు

కమ్ము అనుమాట దానికంటె మేలుకాదా అని చెప్పినప్పుడు అతడు పోయి దైవజనుడు చెప్పినట్లు యొర్దాను నదిలో ఏడుమారులు మునగగా అతని దేహము పసిపిల్ల దేహమువలెనై అతడు శుద్ధుడాయెను. అప్పుడతడు తన పరివారముతోకూడా దైవజనుని దగ్గరకు తిరిగివచ్చి అతని ముందర నిలిచి - చిత్తగించుము, ఇశ్రాయేలులోనున్న దేవుడు తప్ప లోకమంతటియందును మరియొక దేవుడు లేడని నే నెరుగుదును. ఇప్పుడు నీవు నీ దాసుడనైన నాయొద్ద బహుమానము తీసికొనవలసినదని అతనితో చెప్పెను (2 రాజులు 5 అధ్యా).

## పై పాఠమునుండి మనము నేర్చుకొనవలసిన తొమ్మిది పాఠములు :

1. ఆ చిన్నది, చెరగొనినదై నప్పటికిని తనకు తెలిసిన విషయమును ఇతరులకు తెలియజేయు కోరికగలదై యున్నది. దైవజనుడైన ఎలీషా ప్రవక్త విషయము తెలిసినదై తన యజమానురాలితో చెప్పుటకు ఆశక్తి కలిగియున్నది. కాని క్రైస్తవులుగా వుంటున్న మనము క్రీస్తునుగూర్చి మనకు తెలిసినదానిని యితరులకు తెలియచెప్పుటకు ఎన్నోసార్లు వెనుకబడియున్నాము. మన చుట్టువున్న ప్రజలు పాపమనెడి కుష్ఠురోగముతో నశించుచున్నను, నశించువారిని వెదకి రక్షించు యేసుక్రీస్తునుగూర్చి తెలియజేయుటకు సిద్ధపడుచున్నామా ? మనము చేయగల్గినది మనము చేయుచున్నామా? ఆ చిన్నది చేసినది. అదేలాగున మనముకూడా క్రీస్తునుగూర్చి ఇతరులకు చెప్పవలెను.

2. నయమాను స్వస్థత సమాచారము అందిన వెంటనే ఆలస్యము చేయక దైవజనుడైన ఎలీషా ప్రవక్త యొద్దకు వెళ్ళెను. కాని కొంతమంది ప్రజలు క్రీస్తు రక్షకుడను సువార్తను వినికూడ ఆయన యొద్దకు వచ్చుటకు యిష్టపడరు. మరియొకమారు చేయవచ్చులే అని నిర్లక్ష్యము చేయుదురు. దీనిని ఆలస్యము (Procrastination) అందురు. ఈ

అలస్యమే కొన్ని మిలియన్ల ఆత్మలు నశించుటకు కారణమైయున్నది. నయమాను ఆలస్యము చేసినచో తన కుష్ఠురోగము శరీరమంతా వ్యాపించుచునని గ్రహించాడు. అదేవిధముగా మనముకూడా ఆల స్యము చేసి పాపమునకు తావిచ్చి ఆత్మలను నశింపకుండ చేయునట్లు గ్రహించవలెను.

3. కుష్ఠురోగియైన నయమాను దైవజనుడైన ఎలీషా ప్రవక్త యొద్దకు వెళ్ళక, సరాసరి రాజునొద్దకు వెళ్ళెను. నైతికంగా కొన్ని మిలియన్ల ప్రజలు పాపకూపములో నున్నామని తెలిసికూడా మన కొరకు తన విలువైన రక్తమును చిందించిన నిజ రక్షకుడైన యేసు నొద్దకు వచ్చుటకు బదులు వేరేమార్గములు వెదుకుదురు. క్రీస్తు తప్ప మన పాపముల నిమిత్తము ఏ ఒక్కరును ఒక్క బిందు రక్తమును చిందింపలేదు. "ఎందుకనగా మన మాయనయందు దేవుని నీతి అగు నట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను— (2 కొరింథి 5:21)". కాబట్టి ఒకడు రక్షణ పొందవలెనంటే ఆయన ద్వారా తప్ప వేరొక మార్గములేదు. "నేనే మార్గమును, సత్యమును, జీవమును, నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" (యోహాను 14:6).

4. దైవజనుడైన ఎలీషా ప్రవక్త తనంతట తానుగా వచ్చి కుష్ఠురోగమును బాగుపరచు ఉపాయమును కుష్ఠురోగియైన నయమానుకు చెప్పలేదు. కాని ఒక దూతద్వారా తెలియపరచెను. అలాగుననే క్రీస్తుకూడా పాపమునుండి రక్షింపబడు మార్గమును గూర్చి మనకు చెప్పుటకు ఆయన స్వయంగా ఈ భూమిపై లేడు కాని తన శిష్యుల ద్వారా నూతన నిబంధనలో వ్రాయబడియున్న సత్య వాక్యము ద్వారానే పాపమునుండి మనమేలాగు రక్షింపబడగలమో బోధించు చున్నాడు.

కుష్ఠురోగము బాగుపడు నిమిత్తము నీవు వెళ్ళి యోర్దాను నదిలో ఏడు మారులు మునుగుము అని చెప్పినమాట కుష్ఠురోగియైన నయమానుకు యెగతాళిగాను, వెర్రితనముగాను వున్నది. నీటిలో మునుగుటద్వారా కలుగు రక్షణ మార్గమును "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" అను క్రీస్తు యిచ్చిన ఆజ్ఞను నేను చెప్పినప్పుడు నీటిలో మునుగుటద్వారా మానవులు ఎలా రక్షింపబడగలరు అని నన్ను అడుగుట వింటిని. కాని కుష్ఠురోగియైన నయమాను దైవజనుడైన ఎలీషా యిచ్చిన ఆజ్ఞ ప్రకారము యోర్దాను నదిలో ఏడు మారులు మునుగువరకు కుష్ఠురోగమునుండి శుభ్రపడలేదు. అదేలాగున మనమును క్రీస్తు యిచ్చిన ఆజ్ఞప్రకారము నీటిలో మునుగువరకు రక్షణ పొందలేము. క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, అలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు మనము బాప్తిస్మమువలన మరణములో పాలుపొందుటకై ఆయనతో పాతిపెట్టబడితిమి (రోమా 6:4). "గనుక నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమునుబట్టి ప్రార్థనచేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసుకొనుము" (అ.పొ. 22:16).

6. కుష్ఠురోగియైన నయమాను తన స్వంత పద్ధతిప్రకారము కుష్ఠురోగమునుండి శుభ్రపడగలనని తలంచాడు. అతడు నా యొద్దకు వచ్చి నిలిచి, తన దేవుడైన యెహోవా నామమునుబట్టి తన చెయ్యి రోగముగా వున్న స్థలముమీద ఆడించి కుష్ఠురోగమును మాన్పు ననుకొనెను. నయమానువలెనే చాలామంది ప్రజలు రక్షింపబడుటకు చేయవలసిన దేవుడిచ్చిన ఆజ్ఞనుగూర్చి చెప్పినప్పుడు కోపపడుదురు. అనేకమంది దేవుడున్నాడని విశ్వసించినచో రక్షింపబడుదురని ఆశింతురు. కాని బైబిలు అలా బోధించుటలేదు. ఒకడు రక్షింపబడవలెనంటే - క్రీస్తు సజీవుడైన దేవుని కుమారుడని నమ్మి మారుమనస్సు

పొంది, పాపక్షమాపణ నిమిత్తము యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెను (అ.పొ. 2:37, 38; 8:35-39).

7. కుష్ఠరోగియైన నయమాను - దమస్కు నదులైన అబనాయును, ఫర్పరును ఇశ్రాయేలు దేశములోని నదులన్నిటికంటె శ్రేష్ఠమైనవి కావా? వాటిలో స్నానంచేసి శుద్ధిపొందలేనా? అనుకొనెను. అతని ఉద్దేశ్యములో అన్ని నదులు ఒకటే. అదేలాగుననే క్రీస్తు సంఘము దానియొక్క ప్రాముఖ్యతను గూర్చి, ఒకడు రక్షింపబడవలెనంటే క్రీస్తు సంఘములోనే వుండవలెనని బోధించినప్పుడు (అ.పొ. 2:47) అనేకమంది కోపబడి సణుగుదురు. వారి ఉద్దేశ్యములో సంఘములన్నియు ఒకటే ననియు, ఫలానా మత శాఖ సభ్యుడననియు రక్షింపబడుటకు ఏదో ఒక మతశాఖలో సభ్యుడుగా వున్న చాలు ననియు వాదింతురు. కాని కుష్ఠరోగియైన నయమాను విషయములో భేదము కనబడినది. అబనాయును, ఫర్పరును మేలైనన దులన్నిటిలోను, యోర్దాను నదికన్న శ్రేష్ఠమైన దనుటలోను సందేహము లేదు. కాని అతడు మునగవలసినది యోర్దాను నదిలో మాత్రమే. దానికి ప్రతిగా ఏ నదియు నిలబడలేదు. అలాగునే క్రీస్తు ఒకే ఒక సంఘమును నిర్మించెను (మత్తయి 16:18; ఎఫెసీ 4:4). మరియు ప్రభువు రక్షణ పొందుచున్నవారిని అనుదినము క్రీస్తు సంఘములో చేర్చుచుండెను (అ.పొ. 2:47). మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి (1 కొరింథి 12:13, 27; ఎఫెసీ 1:22, 23). కాబట్టి మనము రక్షింపబడవలెనంటే క్రీస్తు సంఘ సభ్యుడుగా వుండవలెను. ఎలాగైతే నదులన్నియు శ్రేష్ఠమైనవికావో అలాగుననే సంఘములు కూడా. రక్షణమార్గము క్రీస్తు సంఘములోనే కలదు. ఏలయనగా రక్షణ పొందుచున్నవారిని అనుదినము క్రీస్తు తన సంఘముతో చేర్చుచుండెను.

8. నయమాను తాను ఊహించినదానికి పశ్చాత్తాపపడి దైవజనుడైన ఎలీషా చెప్పినట్లు వెళ్ళి యొర్దాను నదిలో ఏడుమార్లు మునిగెను. అతడు చాలా వినయము చూపవలసివచ్చెను. అదేలాగున మనముకూడా మన ఊహలు, ఆలోచనలు వదలి క్రీస్తు బోధలకు వినయవిధేయతలు చూపవలెను.

9. చివరకు నయమాను తన కుష్ఠురోగము బాగుపడిన సందర్భమున సంతోషముతో తన కృతజ్ఞత వ్యక్తపరచినవిధంగా మనము కూడా క్రీస్తును నమ్మి ఆయన ఆజ్ఞాపించిన బోధల ప్రకారము ఇతరులకు సువార్తను ప్రకటించుటకు నిరంతర కృషి చేయవలెను (మత్తయి 28 : 18-20; అ.పొ. 2 : 42). మీయొక్క నిజజీవితంలో నయమాను ద్వారా నేర్చుకున్న పాఠం ఒక గుణపాఠం కాగలదని నా ప్రార్థన.

— సన్నీ డేవిడ్, న్యూఢిల్లీ.

---

యేసును వెంబడించిన పండ్రెండుగురు–11

## జెలోతే అనబడిన సీమోను-నాశనపరచే ఒక మంట

## *(Simon the Zealot : A Destroying Flame)*

జెలోతే అనబడిన సీమోను! అతన్ని గూర్చి మనకు ఏమి తెలుసు? మత్తయి మార్కు సువార్తల్లో అతడు కనానీయుడని పిలువబడ్డాడు (మత్తయి 10:4; మార్కు 3:18). లూకా సువార్తలోను, అపొస్తలుల కార్యములలోను అతడు జెలోతే అని పిలువబడ్డాడు (లూకా 6:15; అపొ.కా. 1:13). అపొస్తలుల లిస్టులలోతప్ప అతన్ని గూర్చి మరెక్కడా మనకు చెప్పబడలేదు. అట్లయినప్పుడు అతనిగూర్చి ఏమి వ్రాయగలము? అనేకసంగతులు !

మొదటిగా అతడు ఒక జెలోతే. జెలోతే అంటే యెవడు? జెలోతే అంటే ప్రగాఢమైన దేశాభిమాని, మతాభిమాని అని అర్థము. క్రీస్తు చనిపోయేసరికి జన్మించిన యూదా చరిత్రకారుడగు జోసిఫస్‌నుండి

ఈ జెలోతేలనబడు వారందరు చెడ్డవారని మనకు తెలియుచున్నది. అతని కాలంలో వాళ్ళందరు దుర్మార్గులు, దొంగలు దోచుకొనువారు, హంతకులు. యెరూషలేము రోమీయులకైవసమైనప్పుడు జెలోతేల చేతిలో పడేకన్నా రోమీయుల చేతిలో పడితేనే మేలని యూదులు తలంచారు.

ఈ జెలోతేలు మొదట్లో దేశభక్తులని యూదుల దేశాన్ని ధర్మశాస్త్రాన్ని గాఢంగా ప్రేమించేవారని మనం తలస్తే ఇక్కడ ఒక గొప్ప పాఠాన్ని నేర్చుకోవచ్చును. దేశభక్తియొక్క తీవ్రత హెచ్చుగాయుంటే దాని ప్రభావం తోటి పౌరులమీదనే కన్పడుతుంది. దేశభక్తి పేరుతో ఎన్ని ఘోర కార్యాలు చేయబడుట లేదు! ప్రతి దేశములోయున్న ప్రతివారిని ప్రేమించగలిగినప్పుడే దేశభక్తుడు తన దేశాన్ని సరిగా ప్రేమించగలడు, తన దేశాభిమానంవలన పొరుగువాని యెడల ద్వేషాన్ని జనింపజేసే భక్తి విషపూరితమైనది. ఇక్కడ యోనా కథను మనం జ్ఞాపకం తెచ్చుకోవచ్చు.

జెలోతే యనబడిన దేశాభిమాని మొదట్లో తన జనాంగాన్ని గాఢంగా ప్రేమించగలిగితే, అతడు క్రైస్తవుడైనప్పుడు తన వారినే కాదు, లోకంలోయున్న వారందరిని ప్రేమించగలడు. ఈ యావత్ప్రపంచము దేవునిదేయని అతడెరుగును. ప్రార్థనమందిర మనబడవలసిన దేవాలయాన్ని అపవిత్రపరచుచున్న వ్యాపారులను తన ప్రభువు పారదోలి దాన్ని పవిత్రపరచిన ఆయన ఆసక్తిని అతడు జ్ఞప్తికి తెచ్చుకొనును. సంకుచిత మతాభిమానియైన ఈ బోధకుడు ప్రపంచమంతా తన ప్రచార పొలమైనట్లు కనుగొనును.

జెలోతే యనబడిన సీమోనులో అన్నిరకాలైన మనుష్యులను నడిపించగల యేసుయొక్క శక్తిని మనం కనుగొనగలము. రోమా ప్రభుత్వానికి సుంకము వసూలుచేసిన మత్తయితో సహవసించడం సీమోనుకు క్లిష్టముగా యుండును, గాని వారు కలసి జీవించడానికి, కలసి పనిచేయడానికి దేవుని ఆశ్చర్యకరమైన కృపయే మూలము.

సీమోనును పిలుచుటలో మన ప్రభువు పిరికివారిని గూర్చి, ధైర్యసాహసాలు లేనివారిని గూర్చి, తమ ఛాయను చూచి తామే జడుసుకొనేవారిని గూర్చి ఆసక్తి చూపించలేదని మనం గ్రహించగలం. ఆయన శిష్యులలో అనేకులు ప్రగాఢమైన భావోద్రేకాలను కలిగినవారు: యాకోబు యోహానులు (ఉరిమెడివారు), పౌలు (హింసించేవాడు), పేతురు (కలహించేవాడు, ఒట్లు పెట్టుకొనేవాడు).

మానవుల ప్రవర్తనలోయున్న బలమైన అంశాలను నిర్మాణాత్మకమైన పంథాలో నడిపించే శక్తి మన ప్రభువులో యున్నది. ఆయనకు ధైర్యం, సాహసం, నిర్భయం కావాలి. ఈగుణాలు నాశనం చేయుటకు గాక నిర్మాణాత్మక ప్రయోజనాలకు ఆయనకు కావాలి. అగ్ని ఇంకా అగ్నిగానే యుండవచ్చు, భావోద్రేకాలు చల్లారిపోనవుసరంలేదు, కోపాగ్ని ఇంకా రవులుకోవచ్చు, గాని ఇవన్నీ ఇప్పుడు చలించవలసిన పంథా వేరైనది.

క్రీస్తులో జెలోతేలు మనుష్యులతో గాక అపవాదితోను అతని పరివారముతోను పోరాడుతారు. అందువలననే "దేవుని తప్ప వేరొకదానిని ప్రేమించనివారిని, పాపాన్ని తప్ప వేరొకదాన్ని ద్వేషించని వంద మందిని నాకిస్తే ఈ లోకాన్నే మార్చేస్తాను" అని జాన్ వెస్లీ అన్నాడు.

ఒక యుద్ధంయొక్క ఘోరకృత్యాలు, భయంకర సన్నివేశాలు తప్ప దాని ఆవేశాన్నంతటిని యేసు ఇచ్చుచున్నాడు. సీమోనులో అపాయాన్ని ఎదుర్కొనడం అంటే ఏమిటో యెరిగిన శిష్యుడు యేసుకు ఉన్నాడు. అతడు అన్నిటికి సాహసిస్తాడు, అన్నిటిని త్యజిస్తాడు. ఆత్మ పరిత్యాగము (self sacrifice) యొక్క యథార్థ భావాన్ని అతడు గ్రహిస్తాడు. అభావరూపక జీవితాన్ని జీవిస్తాడు.

నీవు గొప్ప భావోద్రేకములు గలవాడవా ? నీవు యేసును కలిసికొన్నప్పుడు, నిజంగా కలిసికొన్నప్పుడు ఆయనసగ్గర నీ వేడి

స్వల్పము మాత్రమే యని కనుగొందుము. జెలోతే యనబడిన సీమోను కొంకు యేసు ఇంకా చూచుచున్నాడు.

— గోర్డన్ టీల్

---

## దేనివలన మాత్రమే రక్షింపబడ్డావు?

*(Saved by what only ?)*

మానవుని రక్షణ పథకములో అనేక అంశములున్నాయి, వానిలో ఏ ఒక్కటి మాత్రమే రక్షించదు. రక్షించే అంశాల్లో కొన్నింటిని చూచుకొందాము :

దేవుని వాక్యం రక్షిస్తాది : "లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి" (యాకోబు 1:21).

కృప విశ్వాసములు రక్షించును : "మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడి యున్నారు" (ఎఫెసీ 2:8). కృప ఉంటే రక్షణ బేషరతైనదని కాదు. గాని ఆ షరతులున్నను రక్షణకు పాత్రులము కాము. అయితే ఆయన రక్షించుచున్నాడు. ఇది దేవుని కృప.

క్రీస్తు రక్తము రక్షించును : క్రీస్తు "తన రక్తమువలన మన పాపములనుండి మనలను విడిపించును" (ప్రకటన 1:5).

సువార్త ప్రకటన రక్షించును : "సువార్త ప్రకటన యను వెర్రితనముచేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్పమాయెను" (1 కొరింథి 1:21).

క్రియలు రక్షించును : "మనుష్యుడు...క్రియల మూలమునను నీతిమంతుడని యెంచబడునని మీరు దీనివలన గ్రహించితిరి" (యాకోబు 2:24).

మారుమనస్సు రక్షించును : "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారు

మనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" (అపొ. కా. 17:30).

బాప్తిస్మము రక్షించును: "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది; అదేదనగా శరీర మాలిన్యము తీసివేయుటకాదు గాని యేసుక్రీస్తు పునరుత్థానమూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షినిచ్చు ప్రత్యుత్తరమే" (1 పేతురు 3:21). బాప్తిస్మము రక్షించును ఏలయనగా క్రీస్తు రక్తముయొక్క శక్తివలన దానిలో పాపములు కడిగివేయబడును (అపొ.కా. 2:38; 22:16).

మన రక్షణనిమిత్తము అవసరమైన అంశాల్లో యివి కొన్ని. వాటిలో ఏ ఒక్కదాన్ని మనం ఎంచుకొని దాని వలన మాత్రమే రక్షింపబడితిమని చెప్పుకొనే హక్కు మనకు లేదు. సరిగదా రక్షణ కవుసరమయ్యే అంశాన్ని దేన్నీ తీసివేసే అధికారం మనకు లేదు. దేవునికి విధేయులయ్యేవారు ఆయన కృపవలన రక్షింపబడి ఆయన సంఘములో చేర్చబడుదురు (హెబ్రీ 5:9; అపొ.కా. 2:47).

—జీన్ డి. ఓవర్టన్.

---

## నీవు అపవాదిని ఆపుచేయగలవు!

### *( You can stop Satan ! )*

పాపము చేయునట్లు నీవు శోధింపబడుచున్నావా? దాన్ని గూర్చి నీవేమి చేయదలచుకొన్నావు? నీవేమి చేసినను సాతానుకు లోబడిపోకు! అతడు జీవించేయున్నాడు. నీ యాత్మను నరకంలో నాశనం చేయాలని చూచుచున్నాడు. ఈ వాస్తవాన్ని నీ వెఱగక పోతే అదే అతనికొక గొప్ప ఆయుధం.

నీవు అపవాదిని అరికట్టగలవని దీనిద్వారా నీకు జ్ఞాపకం చేయ గోర్తాను. "సాధారణముగా మనుష్యులకు కలుగు శోధనతప్ప మరి

ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు; మీరు సహింపగలిగినంతకంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడ నియ్యడు. అంతేకాదు సహింపగలుగుటకు ఆయన శోధనతోకూడ తప్పించుకొను మార్గమును కలుగజేయును" (1 కొరింథీ 10:13). "కాబట్టి దేవునికి లోబడియుండుడి, అపవాదిని ఎదిరించుడి, అప్పుడు వాడు మీయొద్దనుండి పారిపోవును" (యాకోబు 4:7).

దుష్కార్యములకొరకు అపవాది నిన్ను పురికొల్పేటప్పుడు ఈ వచనాలను దయచేసి జ్ఞాపకముంచుకో. దేవునికి లోబడు, దేవుని యందు నమ్మికయుంచు, తప్పించుకొనే ఆ మార్గంకొరకు చూడు. అపవాది నీదగ్గరనుండి పరుగెత్తుతు పారిపోవడం చూడగలవు. నీవు అపవాదిని అరికట్టగలవు!!

---

## సత్యాన్ని తెలుసుకో

## *( Know the Truth )*

దేవునియెదుట పవిత్రమును, నిష్కళంకమైన భక్తినిగూర్చి మనం తెలుసుకొనేటప్పుడు మనం గ్రహించవలసిన అతి ప్రాముఖ్య సత్యం ఒకటి ఉన్నది. అదేమంటే భక్తిగల వారందరు రక్షింపబడ బోవుట లేదు! ఈ వాస్తవాన్ని అంగీకరించుటకు అనేకులు నిరాక రింతురు గాని అది సత్యం.

చరిత్ర యంతటిలోను మానవుడు భక్తిపూరితుడని మనం ఇట్టే గమనించగలం. ఏదెను వనంనుండి నేటివరకు తనకంటె ఉన్నతుడైన మూర్తిని ఆరాధించాలనే కోరిక మానవునిలోవుంది. అయితే మానవుని ఈ భక్తితత్వం అంతా దేవునికిష్టపూర్వకమైనది కాదు. మత్తయి 15:9లో క్రీస్తు ఇట్లు సూచించాడు: "ఈ ప్రజలు తన పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధిం

చుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు". వ్యర్థమంటే పనికిరానిది, శూన్యమైనది, నిష్ప్రయోజనమైనది, విలువలేనిది, నిష్ఫలమైనదని యర్థము. దేవుని పద్ధతినిబట్టిగాక మానవుల పద్ధతులనుబట్టి చేయు ఆరాధన అట్టిదేయని యేసు చెప్పాడు మత్తయి 7:21లో యేసు దాన్ని ఇంకా ఇట్లు వర్ణించాడు: "ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును".

మానవులు జీవించే రకరకాల భక్తి జీవితములు దేవునికి ఇష్టపూర్వకమైనవి కావనిచెప్పే ఉదాహరణలు బైబిలులో అనేకములున్నవి. పాతనిబంధనలో కొన్ని ఉదాహరణలు: ఆది 4:1-5లో కయీను, లేవీకాండము 10:1-2లో నాదాబు అబీహులు, విగ్రహారాధన చేసిన అన్యజనాంగములు, అరణ్యములో ప్రయాణముచేసిన దేవుని జనాంగమగు ఇశ్రాయేలీయులు (1 కొరింథి 10:1-10) మొదలగునవి. క్రొత్తనిబంధనలో కొన్ని ఉదాహరణలు. తండ్రి చిత్తప్రకారము చేయనివారు (మత్త 7:21-23); మత్తయి 15:1-9లో శాస్త్రులు పరిసయ్యులు, అపొ.కా. 17:22-31లో ఏథెన్సు ప్రజలు, రోమా 10:1-3లో ఇశ్రాయేలీయులు, ప్రకటన 2:3లో ఆసియాలోని ఏడు సంఘములు. ఇక్కడ చెప్పబడిన ఈ ప్రజలందరు భక్తిగలవారే అయినను వారు నశించినవారు. ఏలయనగా కేవలం భక్తిపరులుగా యుండుట సరిపోదు. నిజంగా భక్తిపరులైనవారు తండ్రియైన దేవుని చిత్తాన్నిబట్టి నడుచుకోవాలి. క్రైస్తవులని చెప్పుకొనేవారిలో అనేకులను దేవుడు ఎరుగడు. వారు క్రీస్తు సువార్తకు లోబడలేదు. దేవుని బోధనుగాక మనుష్యుల పద్ధతులనుబట్టి వారు నడుచుకొనేవారు.

అబద్ధ బోధకులనుగూర్చి, తమ యిష్టమువచ్చినట్లు దేవుని ఆరాధింపగోరు వారినిగూర్చి బైబిలు ఎంతో చెబుతుంది. ప్రతి సందర్భములోను మానవులు ఆయన చిత్తమునుండి తొలగిపోయినప్పుడు వారి పనులనుబట్టి దేవుడు వారిని ఖండించాడు. ఇంతవరకు మనం చూచిన

వారివలె మనం భక్తిపరులమనుకోవచ్చును గాని నాశనం చెందుచుండవచ్చును. దేవునియెదుట పవిత్రమును నిష్కళంకమైన భక్తి మనకు ఉంటే దేవుని చిత్తాన్ని సంపూర్తిగ జరిగించుటకిది మనలను నడుపును, నీ భక్తినిగూర్చిన సత్యాన్ని తెలుసుకో.

—గ్లెండన్ కేంబ్రెల్.

## మీకొక సదవకాశము!

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలో మేము ముద్రించబోవునట్టి పుస్తకములను, సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 10/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరువండి!!

SATYA VANI, Seshagiri Rao St,. Kakinada - 533 004.

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA–533 001

To
....................................
....................................
....................................
....................................